"అలా వున్నావేం సరూ?" కాఫీ కలుపుకు వచ్చిన సరోజని అడిగాడు శ్రీధర్.

"రాజీ మళ్ళీ ఉత్తరం వ్రాసింది"– దీర్ఘంగా నిట్టూర్చింది సరోజ. శ్రీధర్ ముఖంలో రంగులు మారాయి. కొంతసేపటికి గుండె దిటవు చేసుకుని ఉత్తరాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

"మహాలక్ష్మీ సమానురాలైన వదినకు–

రాజీ నమస్కరించి వ్రాయునది. నేను ఇక్కడి పరిస్థితి గురించి అంత వివరముగా వ్రాసినా మీ దగ్గర నుంచి నేను ఆశించిన సమాధానం రాలేదు. మీరింకా ఆలోచిస్తూనే వున్నారనుకుంటాను.

ఇన్నేళ్ళనుంచి ఎంతో సహనం వహించిన నాలో ఇక జీవితాంతం భరించే ఓపిక నశించింది. వీళ్ళు నా ప్రాణాలు తీసినా లేక వీళ్ళ బాధలు భరించలేక నేనే ఆత్మహత్య చేసుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇప్పటికైనా నా పరిస్థితి మీ కర్థమై ఉంటుంది. అన్నీ తెలిసిన మీకు ఇంతకంటే నేనేం వ్రాయలేను. నాకు మీరుతప్ప ఇంకెవరున్నారు? అన్నయ్యకి నమస్కారములు చెప్పు. ఉంటాను మరి!

రాజీ"

ఉత్తరం చదివిన శ్రీధర్ కి కన్నీటి పొరలో గతం కళ్ళముందు మెదిలింది

* * *

రాజేశ్వరి పుట్టగానే తల్లిని కోల్పోయింది. కొందరికి దురదృష్టాలు మధ్యలోవస్తే కొందరికి పుట్టుకతోనే వస్తాయేమో! రాజేశ్వరి రెండోకోవకి వస్తుంది. రాజేశ్వరి నల్లటి నలుపేకాక ముఖంలో ఏవిధమైన కళాకాంతులు లేవు. చిన్నప్పటినుంచి అందరి నుంచి అవహేళనలే ఎదుర్కొంది. ఆడపిల్ల తండ్రిపోలిక, మగపిల్లాడు తల్లిపోలిక

# మనసు మూగది



సోమంచి ఉషారాణి

Bali

అయితే అదృష్టమనే మాటల్లో వీసమెత్తు నమ్మకంలేదు శ్రీధర్‌కి. అందుకు తాను, తన చెల్లెలు నిదర్శనమని అతని ఊహ. రాజేశ్వరి తండ్రి పోలికైతే, శ్రీధర్ తల్లి పోలిక. కొంచెం అందగాడనే చెప్పవచ్చు. అయితే అతనికి చదువబ్బలేదు ఎలాగో స్కూల్‌ఫయినల్ పూర్తిచేసి, ఏదో కంపెనీలో అటెండర్‌గా చేరాడు. రాజేశ్వరిమీద అతనికి జాలి తప్ప పెద్దగా ప్రేమాభిమానాలేంలేవు.

రాజేశ్వరి నిండుకుండ. గంభీరంగా వుంటుంది. తన మనసులోని మాట ఇది అనిగాని, తనకు ఫలానాది కావాలనిగాని చిన్నప్పటినుంచి ఎవరినీ అడిగిన పాపాన పోలేదు. అలాగని ఆమె అమాయకురాలు, తెలివితక్కువది కాదు. చదువులో ఆమెకున్న తెలివితేటలకు ఎంతైనా చదివేది కానీ అంత చదివించే స్తోమతు ఆమె తండ్రికి లేకపోయింది.

డబ్బు, అందం రెండూలేని ఆడపిల్లకు త్వరగా పెళ్ళి కానట్లే రాజీకి కూడా చాలా రోజులు పెళ్ళి కుదరలేదు. అసలామె పెళ్ళి జరిగితే ఏ మూడో ప్రపంచ యుద్ధమో సంభవిస్తుందని, కళ్ళున్నవాడెవడూ ఆమెను చేసుకోడని ఆమెను ఎరిగున్న వాళ్ళందరూ నిర్ధారణ కొచ్చారు. అయితే మధ్యవర్తి ఒకరు ఏ పెళ్ళి చూపులూ లేకుండా పెళ్ళి కుదిర్చారు.

అందుకు కారణమూ ఉంది. పెళ్ళికొడుకు గ్రుడ్డివాడు. అతగాడు పెళ్ళికూతుర్ని చూసే ప్రసక్తే లేదు-సరే! ఇక రాజేశ్వరికి తామిచ్చే కట్నంతో ఆమె అందానికి అంతకన్నా మంచి సంబంధం తేలేదు కనుక ఆమె పెళ్ళికొడుకును చూడవలసిన అవసరం(?) లేదు.

తన చెల్లెలు ఎంత అనాకారి అయినా ఒక గ్రుడ్డివాడు తన బావగారంటే మనసొప్పలేదు శ్రీధర్‌కి. "ఏ నలకూబరుడో వస్తాడన్న ఆశ కాకపోయినా "గంతకుతగ్గ బొంత ఎవరో దొరక్కపోతారా? బొత్తిగా గుడ్డివాడితో ఎలా కాపరం చేస్తుంది?" అనుకున్నాడు మనసులో ఆమాటే చెల్లెలితో అన్నాడుకూడా.

"హుం నువ్వెంత పిచ్చివాడివన్నయ్యా! అందం అనేది మన మనసుల్లో వుంటుంది గానీ కేవలం బాహ్యరూపంలో వుంటుందని నేననుకోను. నేను అందంగా లేనని ఈ మాట అనటంలేదు. కానీ ఇది నిజం. పైకి దబ్బపండులా అందంగా వుంటాడు లోపల అనుమానం. అసూయ ఉంటే ఇక ఆ జీవితం నకరప్రాయమేకదా! కళ్ళుండి గ్రుడ్డిగా ప్రవర్తించే వారికంటే కళ్ళులేకపోయినా నన్ను ఒక మనిషిగా, తన జీవిత భాగస్వామిగా పిసరంత అభిమానం చూపించినా నా కన్నా అదృష్టవంతురాలు లేదనుకుంటాను." అంది చిరునవ్వుతో.

"అంత అవసరం ఏముంది? అంతకంటే పెళ్ళి చేసుకోకుండా వుండడమే సుఖమేమో!" వ్యంగ్యంగా అన్నాడు.

"కావచ్చు. జీవితాంతం నన్ను భరించే శక్తి నీకుందా? నీకున్నా-నీకొచ్చే భార్యకూ వుంటుందన్న నమ్మకముందా?" అదే చిరునవ్వు.

* * *

"ఏమిటండీ వచ్చిన దగ్గరనుంచీ అలాగే కూర్చున్నారు? కాళ్ళుచేతులు కడుక్కుని భోజనానికి లేవండి." సరోజ పిలుపుతో శ్రీధర్ ఆలోచనలకు అంతరాయం కలిగింది. ఆకలి లేకపోయినా ఏదో తిన్నాననిపించి లేచాడు. సరోజ వంటింటి పని ముగించుకుని వచ్చింది. శ్రీధర్‌మాత్రం తన దీర్ఘాలోచనలోంచి ఇంకా బయటపడలేదు.

"ఇంతకూ ఏమాలోచించారు" భర్త ప్రక్కన కూర్చుంటూ అడిగింది సరోజ.

ఏమిటో ప్రతిక్షణం గతం గుర్తుకు వస్తోంది. మన జీవితానికి పెద్ద ఆశలూ,ఆశయాలు లేకపోయినా కొద్దిపాటి సుఖానికి కూడా నోచుకోని ఈ బ్రతుకు లెందుకు? పెళ్ళయిన క్షణంనుంచీ ఏం సుఖపడింది రాజీ? దాని సమస్యకి పరిష్కార మేమిటి? అంతంత మాత్రంగా జీవిస్తున్నమనం యింకొక సంసారాన్ని భరించగలమా?" ఆవేదనగా అన్నాడు.

"సంసారం భరించడం సంగతి అలా వుంచండి. జీవిత సాఫల్యానికి హత్యలు, ఆత్మహత్యలు, విడాకులు పరిష్కారం కావుకదా! వాళ్ళిద్దరినీ కలపడానికి మన ప్రయత్నం మనం చేయాలి. ముందు మీరు వెళ్ళి పరిస్థితి ఏమిటో చూసిరండి. వీలుకాని పక్షంలో రాజీని ఇక్కడకు తీసుకువచ్చేయండి" అని అన్నది. కానీ మధ్యవయస్సులోనే రాజీ అన్ని సుఖాలను వదులుకొని, భర్త వుండగానే పరాయి పంచన, తండ్రిలేని పిల్లల్ని పెంచుతూ, బ్రతకాలంటే ఊహిస్తేనే భరింపశక్యం కాకుండా వుంది.

"నేను రేపు ఉదయం వెళ్ళి అటో, ఇటో తేల్చి వస్తాను." నిశ్చలంగా అన్నాఅందులో ఆవేశం, కోపం లేకపోలేదు.

రాజీ పెళ్ళై అత్తవారింటికి వెళుతూ, అక్కడ ఏ విధమైన ఘన స్వాగతాలు


## ఎందుకో మరి!

కలువలవంటి
కన్నులతో
నన్ను ఆడిస్తావు
నీ చిలిపి నవ్వులతో
నా గుప్పెడు మనసును
దోచుకుంటావు

నాకు తెలుసు
నీ అందం
చేతికందని చందమామని
నీవు చూపుతాననే ఆనందాలన్నీ
ఎండమావులని

కానీ ఎందుకో మరి
నిన్ను చూడకుండా ఉండలేను,
ప్రియా ఎందుకో మరి!

—"శశికాంత"



ఆశించలేదుకాని- తన భర్త తనను అర్థం చేసుకుని అనురాగం చూపిస్తే చాలని భగవంతుణ్ణి ప్రార్థించింది.

"నువ్వు చాలా అందంగా వుంటావట కదా! మరి నన్నెందుకు చేసుకున్నావు?" పెళ్ళి నాటినుంచి తన మనసులో అడగనా వద్దా అనుకున్న ప్రశ్నను అడగకుండా వుండలేకపోయాడు రాము. అనుకోని ప్రశ్నకు బిత్తరపోయింది రాజీ.

"ఏం మాట్లాడవేం? నన్ను చేసుకోవాల్సి వచ్చినందుకు బాధపడుతున్నావు కదూ!"

"ఛఛ! నేనలా అనుకునే దాన్నైతే మిమ్మల్ని ఎందుకు చేసుకుంటాను? నాకలాంటి షరతులేం లేవు. నాకెవరూ బలవంతంగా పెళ్ళి చేయలేదు. నేను మనస్ఫూర్తిగా ఇష్టపడే ఈ పెళ్ళి చేసుకున్నాను. ఇక నా అందమంటారా? అది శాశ్వతం కాదుకదా! మనసు కల్మషమైనపుడు ఆ మనిషి ఎంత అందంగా వుండిమాత్రం ఏం లాభం? మనిషికి ఉండవలసింది ఆత్మ సౌందర్యమే. అయితే అది నాకుందనే నేను అనుకుంటున్నాను. కాదు బాహ్యరూపమే అసలైన అందమని భావించేవారికి నేనొక అనాకారిని సరేనా?" నవ్వుతూ అంది రాజీ.

"ఏమిటో నువు చెప్పింది నాకు ఒకటీ అర్థం కాలేదు. నేను నీ అంత చదువుకోలేదుగా! అయినా నా పిచ్చిగానీ నీ అందం గురించి నిన్నడిగితే నువ్వేం చెబుతావులే?" ఆ విషయం తేలిగ్గా వదిలేశాడు రామారావు. వికలాంగుల సౌకర్యార్థం ఏర్పరచిన ఒక ఫ్యాక్టరీలో వర్కర్‌గా పనిచేస్తున్నాడతను.

ఏదో అప్పుడప్పుడు చుట్టుప్రక్కల వాళ్ళ అవహేళనలు, ఇంట్లో అత్తగారి సాధింపులు తప్ప-రాజీ, రామారావు కొంతకాలం అన్యోన్యంగానే వున్నారు. అయితే ప్రక్క-

లీల ప్రక్కింటి అమ్మాయి. వితంతువు. ఆమెకు పెళ్ళయి నకొత్తలోనే భర్త యాక్సిడెంట్‌లో చచ్చిపోతే ఏ ముద్దు ముచ్చట లేకుండానే అత్తవారింటికి వెళ్ళవలసిన అవసరం రాకుండానే ఆమె బ్రతుకు తెల్లారిపోయింది. ఆమె తనిలా మోడులా బ్రతకడం సహించలేకపోతోంది. ఆడదానికి రెండో పెళ్ళి చేయడం తన ఇంటా వంటా లేదన్నాడు తండ్రి. అయితే గ్రుడ్డివాడైన రామూని లోబరుచుకుని తన కోరికలు తీర్చుకోవాలనే వుద్దేశం ఆమె మనసులో వుంది.

లీల ఇంకా అలా భావిస్తున్న సమయంలోనే రామారావు పెళ్ళి హఠాత్తుగా జరిగిపోయింది. లీలకు ఒంటిమీద తేళ్ళు,జెర్రులు ప్రాకుతున్నట్లుండేది. తనకంటే ఏమాత్రం అందంగాలేని రాజీ తన నుంచి రామూని దూరం చేయడం సంగతి అటుంచి ఆ రాజీ అందగత్తని మురిసిపోయి రామూ ఆమెను అభిమానించడం, రాజీ ఎంతో సంతోషంగా అతనికి సపర్యలు చేస్తూ అతని అనురాగాన్ని పొందటం. వారి అన్యోన్య ఫలంగా రాజీకి నెలతప్పడం ఇవన్నీ లీల సహించలేకపోయింది.

"ఆ రాజీ అందగత్తె అనేకదా రామూ భ్రమపడి అంత మురిసిపోతున్నాడు! ఆ అందంతోనే తాను ఒక ఆట ఆడించాలి" అనుకుంది లీల.

ఆమె పథకం ఫలించడానికన్నట్లు రాజీ తండ్రికి ఒంట్లో బావుండలేదని, సీరియస్‌గా ఉందని టెలిగ్రాం రావడంతో రాజీ పుట్టింటికి వెళ్ళింది. ఎవరూ లేనపుడు లీల రామారావు దగ్గరికి వచ్చింది.రామారావు అప్పుడు ఆరుబయట మంచంమీద పడుకుని కూనిరాగాలు తీస్తున్నాడు.

అలికిడి విని ఆశ్చర్యంగా "ఎవరూ?" అన్నాడు, లీల పొడిగా నవ్వి, "నేనే లీలని ఏమిటో మంచి హుషారుగా వున్నావే?" అంది నాందిగా,

లీల మర్యాద లేకుండా మాట్లాడడం రామారావుకి చిరాకు తెప్పించింది. "ఇంతకూ ఆమె ఎందుకు వచ్చినట్లు? ఇంట్లో ఎవరూ లేరు కూడా." అనుకున్నాడు. అమాటే అడిగాడు.

లీల వ్యంగ్యంగా నవ్వి "నేను వచ్చింది నీ కోసమే" అంది.

"ఎందుకు?" ఆశ్చర్యంగా నుదురు చిట్లించాడు.

"నీ కళ్ళేకాదు నీ మనసుకూడా గ్రుడ్డిదని చెప్పడానికి."

"లీలా!"

"ఊరికే అరవకు. నలుగురూ వింటారు. అసలు అంత అందగత్తె నిన్నే ఎందుకు పెళ్ళి చేసుకుందో నువ్వెప్పుడన్నా ఆలోచించావా? అవునులేగుడ్డివాళ్ళని మోసం చేయడం తేలికకదా!"

వెటకారంగా అంది లీల.

"లీలా! నీ నోటికొచ్చినట్లు మాట్లాడే అధికారం నీకెవరిచ్చారు? రాజీ అందంగా వున్నా, లేకపోయినా నాకు ఒకటే! నాకు కావలసింది ఆమె మంచి మనసు. రాజీ మనస్ఫూర్తిగా ఇష్టపడే ఈ పెళ్ళి చేసుకుందని యిన్నాళ్ళలో నేను గ్రహించాను. ఇందులో మోసానికి తావులేదు. ఒకవేళ గ్రుడ్డివాడని నామీద జాలిపడి చేసుకున్నా నాకేమీ బాధలేదు."


"పిచ్చి రామూ! నీ అమాయకత్వమే నిన్ను మోసగిస్తోందని ఒక స్నేహితురాలిగా నీ మీద జాలిపడ్తోంది. ఏదో నాకు తెలిసిన నిజం చెప్పి, ఇకనుంచైనా నీ భార్యను నువు అదుపులో పెట్టుకుంటావని ఆశించాను. పోనీలే...."

"ఏమిటో ఆ నిజం" నమ్మకం అనే పై మెట్టుమీదనుంచి అనుమానంఅనే క్రింద మెట్టుమీదకు జారడం చాలా సులభం.

"నీ భార్య పెళ్ళికాని క్రితమే ఎవడినో ప్రేమించింది. వాడెవడో మోసంచేసి పారిపోతే కనీసం పెళ్ళి చూపులన్నా ఏర్పాటు చేయకుండా, హడావిడిగా కళ్ళులేని నీకు కట్టబెట్టారు. లేకపోతే అంత అందగత్తె—"

"లీలా!" మధ్యలోనే గట్టిగా అరిచాడు రాము. "ఇంకెప్పుడూ ఇలాంటి లేకిమాటలు చెప్పడానికి రాకు. నేను గ్రుడ్డివాణ్నే కానీ, పిచ్చివాణ్ణి, తెలివితక్కువవాణ్ణి కాదు. జాగ్రత్త" హెచ్చరించాడు.

రామూ పైకి అలా అన్నాడేకాని అతని మనసులో అనుమానబీజం నాటుకుంది. ఇక అది వేళ్ళు పాతుకుని. మొక్కై, మ్రానవడానికి ఎంతసేపు? ఎంత కాదనకున్నా రాజీ ప్రవర్తనను అనుమానించలేకపోతున్నాడు. "ఆమె మాటలు,చేతలు ఎంత అభిమానంగా వుంటాయి! ఇదంతా కేవలం నటనేనా? ఇది సాధ్యమా? ఏమో తను చూడలేడు."



రాజీకి తండ్రి ఆఖరి చూపుకూడా దక్కలేదు. దుఃఖాన్ని దిగమింగుకుని, అన్నయ్య ఒక్కడే వున్నాడు బాధపడతాడని ఒక నెల్లాళ్ళు ఉండివస్తానని, తనకూ అంతగా ఒంట్లో బావుండలేదని అత్తగారికి ఉత్తరం రాసింది. కానీ ఆ ఉత్తరం చేరవలసిన చోటికి చేరలేదు.

రామారావు రాజీ రాకకై ఎదురుచూడ సాగాడు. రాజీ కనీసం ఉత్తరం కూడా వ్రాయకపోవడం అతనికి బాధ కలిగించింది. దానికి తోడు లీల రోజూ మాటలతో అతన్ని మరింత చిత్రవధ చేయసాగింది. అతని దగ్గరకు పనిగట్టుకుని వచ్చి.

"మీ ఆవిడ ఇంకా రాలేదేం? ఏం వస్తుందిలే? అక్కడ ఏం గ్రంథం నడిపిస్తోందో! తండ్రి కూడా పోయాడు. అడిగే వాళ్ళెవరు ? ఏకంగా పురుడుపోసుకుని వస్తుందేమో !" అని వ్యంగ్యంగా నవ్వేది. రాము కోపం ఆమెకు సంతోషం.

"రాజీ తండ్రిపోయాడా ? కనీసం ఆ విషయమన్నా వ్రాయలేదేం ? అవునూ! ఈ సంగతి తామెవరికీ తెలియకుండా లీలకెలా తెలిసింది" ఆ మాటే అడిగాడు అనుమానంగా.

"ఆఁ మా కజిన్‌ది ఆ ఊరే. మొన్న వచ్చాడు యిక్కడికి. మాటల్లో వాడు చెబితేనే తెలిసింది. పాపం నీకు తెలియదేమో" మరొక వాడిబాణం విసిరి అక్కడినుంచి వడివడిగా వెళ్ళిపోయింది.

*   *   *

నెల తర్వాత రాజీ తిరిగివచ్చింది. నవ్వుతూ అడుగుపెట్టిన రాజీని ఎవరూ పలకరించలేదు భర్త అలకకు కారణం తెలియలేదామెకు.

"అలా వున్నారేం ? ఒంట్లో బావుండలేదా ?" ఆప్యాయంగా మీద చెయ్యివేసిన రాజీని ఎప్పటిలా దగ్గరకు తీసుకోలేదు. కారణంలేని మౌనం రాజీకి బాధ కలిగించింది.

"అదేమిటే ఒక్క ఉత్తరం ముక్కైనా రాయలేదు ? ఇన్నాళ్ళూ ఏమైపోయ్యావో అనుకున్నాము" అంది రాజీ అత్తగారు సాధింపుగా.

"నేను అన్నయ్యకు సాయంగా నెల్లాళ్ళు వుండివస్తానని, ఒంట్లో బావుండలేదని మందులు తీసుకుంటున్నానని అన్నీ వివరంగా ఉత్తరం రాశానే! మీకు అందలేదా?" ఒక వేళ భర్త కోపానికి ఆదే కారణం అయ్యుంటుందని అనుకుంటూ ఆశ్చర్యంగా అడిగింది రాజీ.

"ఏమో రాశావో, లేదో? మాకు అందలేదు." చెంపచెళ్లుమన్నట్లుగా అని అక్కడినుంచి వెళ్ళిపోయింది అత్తగారు. వాళ్ళు తనని నమ్మడంలేదని రాజీకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

*   *   *

నెలలు నిండుతున్నకొద్దీ ఇంటెడుచాకిరీ, ఇంట్లోవాళ్ళ సాధింపులకన్న భర్త మౌనమే రాజీని చిత్రవధ చేయసాగింది. ఫలానా కారణం అని తెలిస్తే సరిదిద్దుకోవచ్చు. ఒక వేళ తాను అనాకారినని తెలిస్తే ఆ నిజం దాచానని కోపమా ?

రాజీకి ఈ పరిస్థితేమో అర్థంకాలేదు. ఆమె అన్ని అవమానాలను, అందరి అవహేళనలను మౌనంగా భరిస్తూ కాలం గడుపుతోంది. అన్నిటికి తోడు శ్రమవల్ల అయితేనేమి, మరో కారణం వలన అయితేనేమి లీల ఇంట్లో వాళ్ళతో ఏదో రహస్యంగా మాట్లాడటం గమనించినా ఆ అభాగ్యురాలిని అనుమానించలేకపోయింది. రాజీ ఏడో నెలలోనే డెలివరీ అయింది. ఇది రామారావు అనుమానాన్ని మరింత పెంచడమేకాక లీల పథకానికి మరో సోపానమైంది. ఆమె అదనెరిగి విసిరిన మాటలు విషపు బాణాలై నాటుకున్నాయి.

రాజీకి ఇద్దరుఆడపిల్లలు పుట్టారు. శ్రీధర్ చూసిపోదామని వచ్చాడు కానీ ఆసుపత్రిలో వున్న చెల్లెలికి అతనే దిక్కయ్యాడు.

ఆరు నెలల తర్వాత శ్రీధర్‌కి పెళ్ళి కుదిరింది. పెళ్ళికి వెడతానంటే భర్త ఏమీ సమాధానం చెప్పకపోవడంతో పసిపిల్లలతో కష్టమని అన్నగారి పెళ్ళికి వెళ్ళలేదు. కారణం తెలియని భర్త మౌనవ్రతం రోజు రోజుకీ ఆమెని దహించివేయసాగింది.

రోజులు గడుస్తున్నాయి. పిల్లల మందులకి, పాలడబ్బాలకి డబ్బు చాలటంలేదని భర్త వద్దన్నా చిన్న ఎలిమెంటరీస్కూల్‌లో టీచరుగా చేరింది రాజీ.

ఇంటెడు చాకిరీతో, పిల్లల్ని చూసుకుని, ఉద్యోగం చేయాలంటే రాజీ అలసిపోయేది. కానీ ఆమె ఆశించినట్లు ఒక్క ఓదార్పు మాటకూడా రామూనుంచి లభించకపోవడం ఆమెకు మరింత బాధ కలిగించింది. భర్త నిర్లక్ష్యానికితోడు మరింతగా విజృంభించిన అత్తగారి దురుసుతనం ఆమెను కృంగదీస్తోంది. రాజీలో నానాటికీ ఓపు నశించసాగింది. ఎవరైనా మౌనాన్ని ఎన్నాళ్ళు భరించగలరు ?

*   *   *

"అన్నయ్యా! ఎప్పుడు వచ్చావు?" స్కూల్ నుంచి అలసిపోయి వచ్చిన రాజీని జాలిగా చూశాడు శ్రీధర్. తను వచ్చిన అయిదు నిమిషాల తర్వాత మూలుగుతూ వచ్చి" మా అబ్బాయి బయటికెళ్ళాడు. కూర్చో నాయనా. అదెప్పుడొస్తుందో



అంబడిపూడి
సెక్సు విజ్ఞాన ప్రచురణలు

ప్రపంచంలో వున్న ఏకైక సెక్స్ లేబరేటరీ నిర్వహించిన డాక్టర్స్ మాస్టర్స్ జాన్సన్ సెక్సాలజీ ఎడిటర్ లెమన్ క్లార్కు డాక్టర్ రాబర్ట్స్ చార్ట్‌హాం పరిశోధనల ఆధారంగా దంపతులు ఆనందంగా తృప్తిగా జీవించడానికి వివాహ జీవితం విజయవంతమై ఆరోగ్యకర సంతానానికి ప్రతి స్త్రీ పురుషుని దృష్టిలో పెట్టుకొని రూపొందించ బడిన పుస్తకాలు. తెలుగులో

1. గుప్తజ్ఞానం వెల రూ. 10/-
2. 1001 సిగ్గుపడే ప్రశ్నలు వెల రూ. 10/-
3. సెక్స్ విజ్ఞానం వెల రూ. 10/-
4. గర్భమూ-గర్భనిరోధం 5/-
5. సెక్సులోపాలు-సర్దుబాట్లు 6/-
6. ఉద్రిక్తస్థానాలు-తృప్తికి మార్గాలు 6/-
7. కేళీ విలాసం 5/-

మిత్రులతో చెప్పుకోలేక డాక్టర్‌తో చెప్పడానికి సిగ్గుపడి లోలోన కుంగిపోతున్న యువతీ యువకుల సందేహాలు సమాధానాల రూపంలో సెక్స్ విజ్ఞానం. నిరాశ. నిస్పృహ ఆత్మహత్యలు నివారించి సంతోషంగా జీవించగల మార్గాలు ప్రపంచమన్ని భాషల్లో అనువదించబడిన పురాతన హిందూ సెక్స్ ప్రామాణిక గ్రంథం. మహర్షి

8. వాత్స్యాయన కామశాస్త్రం 5/-

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జి.డి. ఖోస్లా పుస్తకం ఇన్స్పిరేషన్‌తో వ్రాయబడింది స్త్రీ మానసిక పరిశోధకురాలు డాక్టర్ సైమన్ డి బోవర్ ఆధారంగా హిందూ శాస్త్రాల ఆధారంగా

9. స్త్రీలనాకర్షించడమెలా 4/-
10. పురుషులనాకర్షించడమెలా 10/-
11. ఆడది కోరేదేమిటి 4/-

రూపాయలు ఎమ్.వో. ముందుగా మని ఆర్డరు ద్వారా పంపిన వారికి రిజిష్టర్డు పోస్టులో పంపబడును వి.పి.పి. పద్ధతి లేదు.
జిలిజ ప్రచురణలు విజయవాడ


మరి!" అని చెప్పి వెళ్ళింది చెల్లెలి అత్త గారు.

"ఇప్పుడే! బాగున్నావా?"

"ఆఁ ముందు కాస్త కాఫీ తెస్తానుండు" అని లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చింది. తరువాత బయటికి తీసుకెళ్ళి తన మనసు విప్పి చెప్పింది.

"పోనీలే మౌనంగా ఉంటే ఉన్నారు. నిన్నేమీ అనటంలేదు కదాని నేనూ ఇన్నాళ్లు భరించాను. కానీ ఈమధ్య "నిన్ను చేసుకుని నా కళ్ళేకాదు నా మనసుకూడా గ్రుడ్డి దని రుజువు చేసుకున్నాను. నిజంగా నేనంటే గౌరవం ఉన్నదానివైతే నాకిష్టం లేని ఉద్యోగం చేస్తావా? ఆ లీలలాంటి దాన్ని చేసుకున్నా కృతజ్ఞతతో శుభ్రంగా నోరుమూసుకుని పడుండేది" అంటున్నారు ఇంతకన్నా ఆ మౌనమే నయమని పిస్తోంది. అది దేన్నయినా భరిస్తుంది కానీ, తనముందు పరాయి ఆడ దాన్ని పొగిడినా, తన శీలాన్ని శంకించినా భరించలేదు. ఆయన ఆ రెండూ చేస్తున్నారు. ఎన్నాళ్ళని ఓపికపట్టను. పిల్లల గురించి ఇన్నాళ్ళూ సహించాను. కానీ, ఇక నావల్ల కాదు. ఆయనలో మార్పురావడం దుర్లభమని తెలిసిపోయింది. ఆ లీలనే కటుకోనీ! అయినా పెళ్ళిలో అంత అభిమానించిన ఆయన ఎందుకిలా మారిపోయారో అర్థం కాకుండా వుంది" అంది రాజీ కన్నీళ్ళతో.

మూలకారణం కొంత అర్థమయింది. సాలోచనగానే లీల వివరాలు తెలుసుకుని. శ్రీధర్ తాను తర్వాత వస్తానని చెల్లెల్ని ఇంటికి పెళ్ళిపొమ్మన్నాడు. ఆ తరువాత మెల్లిగా లీల ఇంటివైపు నడిచాడు శ్రీధర్.

"ఆఁ ఇప్పుడే ఇంటికి వెళ్ళడానికి తొందరేముంది? మీ అదిరి నీకోసం అక్కడ పడిగాపులు పడుతోందనా? వాడ్నెప్పుడో ఇంటికి పిలిపించి, కాఫీయిచ్చి, బజారుకి తీసుకెళ్ళిందట! చిట్టి చూశాడు" వ్యంగ్యంగా అంటూంది లీల.

రాము ముఖం ఆవేశంతో ఎర్రబడింది. అతని కంఠరాలు బిగుసుకున్నాయి. "ఎన్నాళ్ళీ నాటకం? ఈ రోజే దాన్ని చంపేస్తాను...." అని ముందుకు అడుగు వేశాడు.

ఇంతలో లీల తెలివలు చెప్తున్నాయి. శ్రీధర్ గబగబా ఎదుట నిలిచాడు. "రాజీ నీకేం అన్యాయం చేసింది? ఆమె బాధ లన్నిటికీ నువ్వే కారణమని కూడా ఆమె ఊహించలేకపోయిందే! ఆమె మీద నీ [illegible] ? నీ [illegible] అయి పోయినందుకు కనీసం సాటి [illegible] కైనా చేతనైతే సరిదిద్దాలి కానీ నిప్పులు పోస్తావా? నీకేం ఒరిగింది? మానవమాత్రు దెవడయినా నిన్ను క్షమిస్తా దేమో కానీ, ఆ భగవంతుడుమాత్రం క్షమించడు. చెప్పు. ఇప్పటికైనా నువ్వాడిన నాటకాలు. చెప్పిన అబద్ధాలు...."

లీల చెప్పింది వింటూనే రాము స్థాణువై పోయాడు. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "గ్రుడ్డి వాణ్ణని ఇంత మోసం చేస్తావా? నాలాంటి అంగవైకల్యం కలిగిన వాళ్ళకి తమవల్ల తమకిమాత్ర మేనష్టంకాని నీలాంటి వాళ్ళవలన అందరికీ నష్టమే! ఛీ ఛీ" అంటూ శ్రీధర్ చేయి పుచ్చుకుని. "క్షమించండి బావగారూ! ఇన్నాళ్ళూ రాజీని ఎంతో బాధ పెట్టాను. నా పాపానికి నిష్కృతి లేదు. ఇంతకూ ఆమె నాటకం మీకు...."

"ఎలా తెలిసిందని ఆశ్చర్యపడకండి. ఏ మాత్రం ఆలోచించినా అదేమంత కష్టం కాదు. నా చెల్లెలు ఎంత అనాకారో నాకు తెలుసు. మీరు గ్రుడ్డివారు అన్నది ఎంత నిజమో ఆమె కురూపి అన్నది అంతనిజం. మరిదంతా ఎలా సాధ్యం? రాజీ ఇన్నాళ్ళూ నాకేమీ వ్రాయలేదు. ఆమె సంసారంలో కలతలు రేపడం ఇష్టంలేక నేనూ కల్పించుకోలేదు. ఇప్పుడు అది వ్రాసిన ఉత్తరాన్ని బట్టి...." వడివడిగా ఉత్సాహంగా ఇంటివైపు నడుస్తున్న రామారావుని చూసి మాట లాపేసి మనసులోనే హాయిగా నవ్వుకున్నాడు శ్రీధర్.

## దర్పం

పైల్వాన్ రామ్‌సింగ్ ఒకసారి క్రిక్కిరిసిన బజారు వీధిలో వెళ్తూ ఒక సోడా కొట్టు కెళ్ళాడు. నిమ్మకాయ తీసికొని కత్తితో రెండు ముక్కలు చేసి దబ్బల్లోని రసాన్ని పూర్తిగా పిండి తొక్కలు విసిరి వేశాడు.

చుక్క కూడా రసం లేని నిమ్మదబ్బలను తీసికొని ఈ దబ్బల నుంచి ఒక బొట్టు రసం చిందించిన వారికి యాభై రూపాయల పారితోషికం యిస్తానని ప్రకటించాడు.

జనం చూస్తూ నిల్చున్నారు. వారి మధ్య నుంచి బక్కగావుండే ఒక వ్యక్తి ముందు కొచ్చి "ఒకటి కాదు అయిదు చుక్కల రసం తీస్తాను చూడండి" అంటూ అందరి ఎదుటా అయిదు చుక్కల రసం బొటబొటా రాలేటట్లు దబ్బలను పిండాడు. "ఎవరయ్యా నీవు?" అన్నాడు పైల్వాన్. "ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్" అన్నాడా బక్క మనిషి.

జానమద్ది హనుమచ్ఛాస్త్రి